ఓంశ్రీసాయిరాం

బుద్ధుడు

ఇతడు మాయాదేవి. శుద్ధోదనుల కుమారుడు. కష్టములన్నిటికి ఆశయే కారణమనియు, ఆశను విడనాడి తీవ్రవైరాగ్యమును పూని, సర్వప్రాణులమీద దయాప్రేమలు గలిగి యుండవలెనని బోధించెను. దుఃఖమునకు మూల కారణము దారిద్ర్యము, వ్యాధి, ముసలితనము ప్రధాన సమస్యలనియు, అవి ఎట్టివారికైనను తప్పునవి కావనియు దృఢముగా యెరిగి రాజ్యమును తల్లిదండ్రులను, భార్యాపుత్రుని కూడ త్యజించి, దుఃఖమునకు దూరముగానుండు సూత్రమేదియో కనిపెట్టవలెనని సన్యసించి సాధనలు, విచారణలు సలిపి త్యాగము కంటె వేరు భోగము లేదనియు, అదే గొప్ప యోగమనియు స్థిరము చేసుకొని అట్టి తాను కనిపెట్టిన మార్గమునే ప్రజలకు బోధించుచూ దయాప్రేమలతో జీవులను చూడవలెననియు, అహింసయే పరమ ధర్మమనియు ప్రచారము సలిపెను. సర్వజీవ సమాన ప్రేమను చాటిన సిద్ధుడు ఈ బుద్ధుడు.

ప్రాచాన కాలమునుండి భారతీయులు ఆధ్యాత్మికతత్త్వ ప్రభావంచేత ఆనందమును అనుభవించి, అందరికీ పంచుతూ వచ్చారు. భారత దేశమునకు ఉత్తర భాగమున హిమాచలము సరిహద్దుగా ఉన్నది. హిమమనగా పవిత్రమైనది. కనుక, భారతీయులకు పవిత్రత, నిశ్చలత్వం అనేవి సరిహద్దులుగా ఉన్నవి. ఈ దేశంలో ప్రవహిస్తున్న గంగ, యమున, సరస్వతి అనే జీవనదులు మానవునికి దివ్యత్వాన్ని చేకూర్చే కర్మ, ఉపాసన, జ్ఞానములకు ప్రతీకలుగా ఉన్నవి. రామాయణము, భారతము, భాగవతము మానవునికి ఉన్నత ఆదర్శాన్ని అందిస్తున్నవి. భగవద్గీత, ఉపనిషత్తులు మరియు బ్రహ్మసూత్రాలు దివ్యత్వమునకు దారిచూపే దివ్య జ్యోతులుగా వెలుగుతున్నాయి. 'భ' అనగా దివ్యత్వము, ప్రకాశము. కనుక, భారతీయులనగా దివ్యత్వమును ప్రేమించేవారని, ప్రకాశమును అందించేవారని అర్థం. ఇట్టి పవిత్రమైన భారతదేశమందు జన్మించి, 'అహింసా పరమో ధర్మః' అని ప్రబోధించిన ఆదర్శమూర్తి బుద్ధుడు.

శుద్ధోధనునికి లేకలేక కల్గిన కుమారుడు సిద్ధార్థుడు. ఇతడు పుట్టిన ఏడవ దినమే తల్లియైన మాయాదేవి మరణించింది. శుద్ధోధనుని రెండవ భార్యయైన గౌతమి ఇతనిని అల్లారుముద్దుగా పెంచి పెద్ద చేసింది. కనుకనే, ఇతనికి గౌతముడు అని పేరు వచ్చింది. బుద్ధిని, విచారణను అభివృద్ధి పర్చుకున్నాడు కాబట్టి అతనికి బుద్ధుడని పేరు వచ్చింది. ఇతడు పుట్టినప్పుడు ఒక జ్యోతిష్కుడు వచ్చి, 'ఇతడు గొప్ప మహారాజైనా కావాలి, లేక పూర్ణవిరాగియైనా కావాలి' అని చెప్పాడు. ఈ మాటలు విని శుద్ధోధనుడు చాలా భయపడిపోయాడు. ఏమి చూస్తే ఇతనికి వైరాగ్యం కలుగుతుందో అని భయపడి సిద్ధార్థుని ఎక్కడికీ పంపలేదు. బయటకు వెళ్ళినప్పుడు ఏ వృద్ధుడైనా, ఏ మృతదేహమైనా అతని కంటబడితే వైరాగ్యంతో ఇల్లు వదలి పోతాడేమోనన్న భయంతో ఈ ప్రాకృతమైన వికారములు అతని కంటబడకుండా చేశాడు. యుక్తవయస్సు రాగానే సుప్రబుద్ధుడనే తన బావమరిది కుమార్తె యశోధరనిచ్చి వివాహం చేశాడు. వివాహమైతే తన కుమారుడు విరాగిగా మారటానికి అవకాశం లేదని భావించాడు. యువరాజుగా పట్టం కట్టాడు.

ఒకనాడు సిద్ధార్థుడు తండ్రితో, 'రాజైనవాడు కేవలం అంతఃపురంలో కూర్చుంటే లాభంలేదు. కాబట్టి, నేను రాజ్యాన్ని చూడటానికి బయటకు వెడతాను' అన్నాడు. శుద్ధోధనుడు భయపడుతూనే అంగీకరించాడు. వివాహము చేసుకున్నాడు కనుక ఎక్కడికీ పోడనే మూఢనమ్మకము అతనిది. సిద్ధార్థుడు రథముపై కొంత దూరము వెళ్ళిన కరువాత ఒక వృద్ధురాలు కఱ్ఱ చేతబట్టి వంగివంగి నడుస్తూ కనిపించింది. రథసారథిని, 'ఏమిటీ మృగము? చాలా వింతగా కనిపిస్తున్నదే!' అని అడిగాడు. 'ప్రభూ! ఈమె మృగము కాదు. మనిషే! వయోభారంచేత ఈవిధంగా వంగిపోయింది' అన్నాడు. 'అయితే, వయస్సు పెరిగే కొలదీ అందరూ ఈ స్థితికి వస్తారా?' అని అడిగాడు. 'తప్పదు ప్రభూ! ఇది సృష్టియెక్క నైజము' అన్నాడు. ఇంకా కొంత దూరము పోయేసరికి ఒక క్షయ రోగి ఒక చెట్టు క్రింద

కూర్చొని దగ్గుతూ దగ్గుతూ ఆయాసంతో 'అబ్బా' అని అరుస్తున్నాడు. 'ఏమిటిది? ఎందుకీవిధంగా అవస్థపడుతున్నాడు?' అని ప్రశ్నించాడు సిద్ధార్థుడు. రథసారథి, 'ప్రభూ! ఈ శరీరమొక రోగముల గంప. ఎప్పుడెవరికి ఏ రోగం వస్తుందో చెప్పటానికి వీలుకాదు' అన్నాడు. అతని మనస్సులో కొంత మార్పు కలిగింది. ఇంకా కొంత దూరం పోయేసరికి నలుగురు వ్యక్తులు ఒక శవాన్ని మోసుకుంటూ పోతున్నారు. సిద్ధార్థుడు, 'సారథీ! వాళ్ళు మోసుకొని పోతున్నదేమిటి?' అని అడిగాడు. 'శవము, ప్రభూ!' అన్నాడు. 'శవమంటే ఏమిటి?' 'ప్రాణం లేనిదే శవం' 'ప్రాణం అందరికీ పోతుందా?' అని సిద్ధార్థుడు మరల ప్రశ్నించగా, 'ఇది తప్పదు. అందరికీ ఏదో ఒకనాడు ప్రాణం పోక తప్పదు' అన్నాడు. ఈ మాటలు సిద్ధార్థుడు విని వెంటనే ఇంటికి తిరిగి వచ్చాడు. భోజనము చేయలేదు. రాత్రి పడుకున్నాడు. కాని, నిద్ర రాలేదు. సిద్ధార్థుడు కడపటికి సత్యాన్ని గుర్తించాడు. 'నా తల్లిదండ్రులు, బంధువులు, ప్రజలు అందరూ కలసి నాకు వివాహం చేసి నన్ను బంధనలో ముంచారు' అని చాలా విచారించాడు. 'సర్వం దుఃఖమ్, దుఃఖమ్, సర్వం క్షణికిం క్షణికం, సర్వం శూన్యం శూన్యం' అని తీవ్రమైన వైరాగ్యంతో తన 28వ యేట అర్ధరాత్రి సమయంలో భార్యయైన యశోధరను, కుమారుడైన రాహులుని త్యజించి సర్వసంగ పరిత్యాగియై అరణ్యంలో ప్రవేశించాడు. మనం ఎందరో రోగులను చూస్తున్నాము, ఎందరో వృద్ధులను చూస్తున్నాము, ఎన్నో శవములను చూస్తున్నాము. కాని, అందరికీ వైరాగ్యము కలగటం లేదు. అది ఒక్క సిద్ధార్థునికి మాత్రమే కలిగింది. వైరాగ్యం రావాలంటే భగవదనుగ్రహం కావాలి.

మాతానాస్తి పితానాస్తి నాస్తిబంధు సహోదరః
అర్థంనాస్తి గృహంనాస్తి తస్మాత్ జాగ్రత జాగ్రత
జన్మదుఃఖం జరాదుఃఖం జాయా దుఃఖం పునఃపునః
అంత్య కాలేషు మహాదుఃఖం తస్మాత్ జాగ్రత జాగ్రత.

అని హృదయానికి బోధించుకున్నాడు. బంధుమిత్రులే మానవుని బంధనకు మూలకారణమని, ఈ బంధనలే మానవునికి దుఃఖమును చేకూర్చుతున్నవని గుర్తించాడు. కనుకనే, సర్వం దుఃఖం, దుఃఖం – సర్వం క్షణికం, క్షణికం – సర్వం సత్యం, సత్యం అని చాటి చెప్పాడు. ఈ ప్రాకృతమునకు అతీతమైన తత్వాన్ని గుర్తించాలని సంకల్పించుకున్నాడు.

బుద్ధుడు సన్యసించిన తరువాత శుద్ధోధనుడు వచ్చి, 'నాయనా! నేను మహారాజును, నీవు కూడా మహారాజు కావలసినవాడవు. అలాంటి నీవు బిక్షమెత్తుకొని తిరగడమేమిటి?' అని చాలా బాధపడ్డాడు. అప్పుడు బుద్ధుడు, 'అయ్యా! నీవు తండ్రివికాదు, నేను కుమారుడను కాను. ఇరువురము బ్రహ్మస్వరూపులమే. అయితే, ప్రాకృతమైన రీతిలో నీవు మహారాజువు, నేను విరాగిని. నీది రాగము, నాది విరాగము. రాగమే పెద్ద రోగము, విరాగమే నిర్వాణము' అని సూటియైన సమాధానమిచ్చాడు.

జ్ఞానమనగా గ్రంథపరిచయము కాదు. వ్యక్తికి, సమిష్టికి మధ్యనున్న ఏకత్వాన్ని గుర్తించటమే నిజమైన జ్ఞానము. జీవేశ్వర ఏకత్వాన్ని గుర్తించిన వాడే జ్ఞాని. మానవుడు తనలోని మానవత్వాన్నే గుర్తించలేనప్పుడు ఇంక తనలోని దైవత్వాన్ని ఏరీతిగా గుర్తించగలడు! కనుక, ప్రప్రథమంగా తనలోని మానవత్వాన్ని గుర్తించాలి. దీనిని పురస్కరించుకొనియే బుద్ధుడు మొట్టమొదట సమ్యక్‌దృష్టిని అలవర్చుకోవాలని బోధించాడు. కన్నులున్నవి కదాయని అందరినీ చూడకూడదు, అన్నింటినీ చూడకూడదు. చూచిన దృశ్యములన్నీ మనలో నిలిచిపోతాయి. అపవిత్రములైన దృశ్యములను చూడటం వల్ల మనలో అనేక దోషములు, పాపములు ప్రవేశిస్తాయి. కాబట్టి, పవిత్రమైన దృశ్యములను మాత్రమే చూడాలి. అంతరాత్మకు ఏది తృప్తికరంగా వుటుందో దానిని మాత్రమే దర్శించాలి. ఇట్టి సమ్యక్‌దృష్టిని అలవర్చుకున్నప్పుడే మనలో సమ్యక్‌సంకల్పములు ఆవిర్భవిస్తాయి. మూడవది సమ్యక్‌వాక్కు. పరులను నిందించకుండా, పరులను బాధించకుండా, అసత్యమాడకుండా నాలుకను పవిత్రముగావించుకోవాలి. నాలుక ఉన్నది ఎందుకోసం? రుచికరములైన పదార్థములు తినటంకోసమా? పరదూషణ చేయటంకోసమా? కాదు, కాదు.

నాలుక చాలా మధురమైనది, గౌరవనీయమైనది, పవిత్రమైనది. కనుక, ఇట్టి నాలుక చేయవలసిన పని యేమిటి? గోవిందా! దామోదరా! మాధవా! అని ఉచ్చరించాలి. ఇందుకోసమే మనకు నాలుక ఇవ్వబడినది. నాల్గవది సమ్యక్‌శ్రుతి. అపవిత్రమైన విషయాలను వింటే అపవిత్రమైన సంకల్పములే మనలో ఆవిర్భవిస్తాయి. కనుక, పవిత్రమైన విషయాలు మాత్రమే వినాలి. ఈ నాల్గింటితోబాటు సమ్యక్‌కర్మలను ఆచరించాలి. ఆరవది సమ్యక్‌జీవనం. ప్రాకృతమైన విషయవాంఛలతో జీవితాన్ని వ్యర్థము చేసుకోరాదు. ఆదర్శవంతమైన నడత కలిగియుండాలి. ఏడవది సమ్యక్‌సాధన. జపము, ధ్యానము, భజన మున్నగునవి సత్కర్మలేగాని సాధనలు కావు. దుర్భావములను దూరంగావించుకొని సద్భావములను పోషించుకోవటమే సరియైన సాధన. సమ్యక్‌సాధన వలన మనలో మానవతా గుణములు అభివృద్ధి అవుతాయి. దీని తరువాతనే సమ్యక్‌సమాధి ప్రాప్తిస్తుంది. సమ–ధీ అనగా సమబుద్ధిని కలిగి ఉండటమే సమాధి. సుఖదుఃఖములను, నిందాస్తుతులను, చీకటివెలుగులను, లాభనష్టములను సమంగా భావించుకోవటమే సమాధి. ఇట్టి ఏకత్వభావనయే నిర్వాణము.

బుద్ధిని, విచారణను అభివృద్ధి పర్చుకున్నాడు కాబట్టి అతనికి బుద్ధుడని పేరు వచ్చింది. విచారణ రెండు విధములుగా ఉంటుంది. ఒకటి స్వార్థదృష్టితో చేసే విచారణ, రెండవది సమాజదృష్టితో చేసే విచారణ. బుద్ధుడు యజ్ఞయాగాది క్రతువులను విశ్వసించలేదు. కారణమేమనగా మొట్టమొదట మానవుడు భగవంతుడు తనకు అనుగ్రహించిన పంచేంద్రియములను సార్థకంగావించుకోవాలని భావించాడు. బుద్ధుడు వేదమునుగాని, యజ్ఞయాగాది క్రతువులనుగాని విశ్వసించకపోవటంచేత అందరూ అతనిని నాస్తికుడని పిలుస్తూ వచ్చారు. ఇది పరమ అధర్మం. బుద్ధుడు పవిత్రమైన చిత్తము కలిగినటువంటివాడు.

‘బుద్ధం శరణం గచ్ఛామి
ధర్మం శరణం గచ్ఛామి
సంఘం శరణం గచ్ఛామి’

దీని అంతరార్థమేమిటి? మొట్టమొదట మన బుద్ధిని ధర్మమార్గంలో ప్రవేశపెట్టాలి. తదుపరి ధర్మాన్ని సంఘంలో ప్రవేశపెట్టాలి. బుద్ధిని ధర్మంలోను, ధర్మమును సంఘంలోను ప్రవేశపెట్టినప్పుడే జీవితం సార్థకమవుతుంది. సమాజంలో మనం సభ్యులుగా ఉన్నాము. కనుక, సమాజం బాగుపడినప్పుడే మనముకూడా బాగుపడగలము. ‘హ్యాండ్స్ ఇన్ ది సోసైటీ, హెడ్ ఇన్ ది ఫారెస్ట్’ అనగా చేతులు సమాజసేవలోను, తల ఆధ్యాత్మిక చింతనలోను నిమగ్నం కావాలి.

బుద్ధుడు లౌకికమైన సాధనలను అంగీకరించలేదు. ఇవన్నీ ప్రవృత్తి లక్షణాలు. అతని హృదయం నివృత్తి తత్త్వంలో ప్రవేశించింది. ఒక్క దైవమునుగాని, ఒక్క శాస్త్రమునుగాని అతడు ప్రస్తావించలేదు. యజ్ఞమంటే ఏమిటని విచారణ సల్పి, త్యాగమే నిజమైన యజ్ఞమని గుర్తించాడు. ‘త్యాగేనైకే అమృతత్వ మానసుః’ త్యాగము చేసినప్పుడే మనం ఉన్నత స్థాయికి వెళ్ళగలము. నీటిలో ఈదేటప్పుడు ముందున్న జలమును వెనుకకు నెట్టినప్పుడే ముందుకు పోగల్గుతాము కదా! అదేవిధంగా త్యాగము చేసినప్పుడే యోగములో ముందుకు పోగలము. అదే నిర్వాణము. దీనికి ప్రేమయే ప్రధానం. ప్రేమ లేకుండా దేనినీ సాధించలేము.

ఒకనాడు బుద్ధుడు తన శిష్యులతో కూడి ఒక గ్రామంలో ప్రవేశించాడు. ఆ గ్రామంలోని ఒక స్త్రీ బుద్ధుణ్ణి తన యింటికి వచ్చి భోజనం చేయవలసిందిగా ఆహ్వానించింది. బుద్ధుడు అంగీకరించాడు. ఆమె ఆనందంతో పొంగిపోయింది. ఆతృతతో ఇంటికి వెళ్ళి అనేక పదార్థములను వండింది. బుద్ధుడు ఆమె ఇంటికి వెడుతున్నాడన్న విషయం తెలుసుకొని ఆ గ్రామపెద్దతో సహా అనేకమంది బుద్ధుని వద్దకు వచ్చి, ‘స్వామీ! ఆమె చాలా చెడ్డది. ఆమె చేయని పాపమే లేదు. ఆమె ఇంటికి వెళ్ళని మగవాడే లేడు. సర్వసంగ పరిత్యాగులైన మీరు అలాంటి వ్యక్తి ఇంటికి పోకూడదు. ఆమె పెట్టే పాపపు కూడు తినకూడదు’ అని అడ్డుపెట్టారు. బుద్ధుడు చిరునవ్వుతో ఆ గ్రామపెద్దను ముందుకు పిలిచాడు. అతని చేయి పట్టుకొని, ‘అయ్యా! నీ రెండవ చేతితో చప్పట్లు కొట్టు’ అన్నాడు. అతడు, ‘స్వామీ!

ఒక చేయిని మీరు పట్టుకున్నారు. మిగిలిన ఒక చేత్తో నేను చప్పట్లు ఎట్లా కొట్టేది?' అన్నాడు. వెంటనే బుద్ధుడు, 'నిజమే, రెండు చేతులూ కలిస్తేనే చప్పట్లు కొట్టటానికి వీలవుతుంది. అదేవిధంగా, మీరు చెడ్డవారు కావటం చేతనే ఆమెను చెడ్డగా మార్చినారు. మీరు చెడ్డవారు కాకపోతే ఆమె ఒక్కతే చెడ్డది కావటానికి వీలు లేదు. కనుక, నేను మీ ఇంటికి రాను. ఆమె ఇంటికే పోతాను' అన్నాడు. ఈవిధంగా బుద్ధుడు వివేకమును ప్రసరింపజేసి, విజ్ఞాన సుజ్ఞాన ప్రజ్ఞానములను ప్రకటింపజేసి, ప్రజలలో పవిత్రతను, దివ్యత్వమును అభివృద్ధిపర్చుతూ వచ్చాడు.

గౌతమ బుద్ధుడు దేశ సంచారం చేస్తూ, ప్రజలకు ప్రబోధలుచేస్తూ ఒక గ్రామం చేరాడు. ఆ గ్రామాధికారికి బుద్ధుడంటే గిట్టదు. ఎవరైనా బుద్ధుని మాట ఎత్తితే మండిపడేవాడు. ఒకరోజు బుద్ధుడు తన శిష్యులతో కలసి తన గ్రామంలో అన్ని ఇళ్ళకూ భిక్షాటనకు వస్తాడనే విషయం తెలుసుకొని, గ్రామంలో ఉన్నవారందరినీ సమావేశపరచి, 'ఈరోజు బుద్ధుడు భిక్షాటనకు వస్తున్నాడు. అతనికి మీరెవ్వరూ భిక్ష వేయకూడదు. మీ ఇంటి తలుపులనుకూడా తీయకూడదు' అని అదేశించాడు. తానుకూడా తన ఇంటికి తాళంపెట్టి ఇంటి ముందు అరుగుమీద కూర్చున్నాడు.

బుద్ధుడు ఏమీ ఎరుగని వానిలాగ చిరునవ్వుతో గ్రామాధికారి యింటిముందు నిలబడి 'భవతీ! భిక్షాందేహి' అన్నాడు. వెంటనే ఆ గ్రామాధికారి ఆవేశంతో చిందులు త్రొక్కుతూ, 'ఏమయ్యా! సోమరి సన్యాసీ! పనిపాట లేక భిక్షం ఎత్తి పొట్టపోసుకుంటున్నావు. పైగా, ఎంతోమంది యువకులను శిష్యులుగా చేర్చుకొని, వాళ్ళ జీవితాలను నాశనం చేస్తున్నావు. కష్టపడి పనిచేసి పొట్టపోసుకో, పో!' అని నిందించాడు. బుద్ధుడు యేమాత్రం చలించక చిరునవ్వు నవ్వి 'అయ్యా! నాకు ఒక సందేహం ఉంది. మీరు తీరుస్తారా?' అని అడిగాడు. గ్రామాధికారి, 'ఏమిటా సందేహం?' అని గద్దించి అడిగాడు. అప్పుడు బుద్ధుడు, 'అయ్యా! మీ ఇంటికి ఒకడు అడుక్కోవటానికి వస్తాడనుకోండి. మీరు దయతో అతనికివ్వటానికి ఒక పళ్లెంలో మీకు తోచిన పదార్థాలను పెట్టుకొని వస్తారనుకోండి. మీరు ఆ పదార్థాలను అతనికి యివ్వబోతే అతడు వాటిని స్వీకరించకపోతే వాటిని మీరు ఎవరికి ఇస్తారు?' అని ప్రశ్నించాడు. గ్రామాధికారి 'ఇదేం సందేహం? ఆ పదార్థాలు నావి కనుక మళ్ళీ నేను వాటిని నా యింట్లోకి తీసుకుపోతాను. అంతేకదా!' అన్నాడు. బుద్ధుడు చిరునవ్వుతో, 'అయితే ఆ పదార్థాలు అన్నీ మీకే చెందుతాయి కదా!' అన్నాడు. గ్రామాధికారి 'అవును అవి నాకే చెందుతాయి' అన్నాడు. బుద్ధుడు వెంటనే 'చాలా చక్కగా సమాధానం చెప్పారు. నేను మీ యింటికి వచ్చి 'భవతీ భిక్షాందేహి' అన్నాను. మీరు నన్ను దూషించారు. దూషణలనే భిక్ష పెట్టారు. కానీ, మీరు పెట్టిన వాటిని నేను స్వీకరించలేదు. మరి ఆదూషణలు ఎవరు స్వీకరించాలి? మీరే చెప్పండి' అన్నాడు. గ్రామాధికారికి ఏమీ తోచలేదు. ఏంచేస్తాడు? బుద్ధుని పాదాలమీద వ్రాలి క్షమించమని ప్రార్థించాడు.

బుద్ధుని పినతల్లి గౌతమి కుమారుడు ఆనందుడు. బుద్ధుడు నిర్వాణం చెందే సమయంలో అతడు కన్నీరు కారుస్తున్నాడు. అప్పుడు బుద్ధుడు అతనిని దగ్గరకు పిలిచి, 'ఆనందా! నాకు నిర్వాణం ప్రాప్తించటం నీకు దుఃఖంగా ఉన్నదా? నేను ఈ నిర్వాణంకోసం ఎంత కాలము నుండియో తపించాను. ఇప్పుడెంతో ఆనందాన్ని అనుభవిస్తున్నాను' అన్నాడు. ఆనందుడు సత్యాన్ని గుర్తించి, బుద్ధుని బోధనలు ఆచరణలో పెట్టి తానుకూడా నిర్వాణం పొందాడు. అన్ని యుగములలోను అవతారపురుషులు అనేకమంది ఆదర్శములను నిరూపించారు. బుద్ధుడు మొట్టమొదట తాను ఆచరించి చూపించాడు. ప్రతి మహనీయుడూ, ప్రతి అవతారపురుషుడూ ఈవిధమైన ఆదర్శమును అందించారు. 'ఓ మానవులారా! మీరు భగవంతునకోసం ఎక్కడా వెతుకనక్కరలేదు. మీరే భగవంతుడు' అని బోధించారు. వేదము 'ప్రజ్ఞానం బ్రహ్మ' అన్నది. అదియే Costant Integrated Awareness. అదియే బుద్ధుని తత్త్వము. అది ఎప్పటికీ పూర్ణమైనది.